
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
ఆదివారం 28 జూలై 2024



వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: జిల్లాలో ఆగస్టు 1వ తేదీన వంద శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందజేయాలని సిబ్బందిని జిల్లా అధికారులు ఆదేశించారు. సాంకేతిక సమస్యల వల్ల పింఛన్ ఇవ్వలేని వారికి రెండో రోజు ఇవ్వనున్నారు. ఉదయం 6 గంటల నుంచే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్లను అందజేయనున్నారు. 31వ తేదీన గ్రామ, వార్డు సచివాలయ అధికారులు పింఛన్ల నగదును సంబంధిత బ్యాంకుల ద్వారా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆదివారం ప్రత్యేకం
s.u.n.d.a.y.s.p.e.c.i.a.l



అమృత మూర్తులు అమ్మానాన్నలు

అమ్మానాన్నలు అనాథలుగా మారుతున్నారు. అవసాన దశలో అండగా ఉండాల్సిన బిడ్డలు వారిని వృద్ధాశ్రమాల్లో చేర్పించి చేతులు దులుపుకుంటున్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకోర్చి బిడ్డల కోసం తమ ఆర్జితాన్ని ధారపోసి చివరికి దిక్కులేని జీవితాన్ని అనుభవిస్తున్నారు. కనిపెంచడంతోపాటు బిడ్డల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమించే నిత్య కార్మికులైన తల్లిదండ్రులు నిరాదరణకు గురవుతున్న ఈ పరిస్థితుల్లో అమ్మానాన్నల దినోత్సవం జరుపుకోవడం అవసరమా అంటే కచ్చితంగా అవసరమే అని చెప్పాలి. తల్లిదండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో వారిపట్ల బాధ్యతగా వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాలి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల పాత్రను వివరిస్తూ జూలై 4వ ఆదివారం తల్లిదండ్రుల దినోత్సవం జరుపుకుంటున్నారు. 1994లో ఆనాటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ ఫాదర్స్ డే, మదర్స్‌డేలను రద్దు చేసి తల్లిదండ్రుల విషయంలో లింగభేదం ఉండరాదన్న ఉద్దేశంతో తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించగా ఆ దేశ సుప్రీంకోర్టు ఇందుకు అంగీకరించింది. అప్పటినుంచి ప్రపంచదేశాల్లో తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మనదేశంలో కూడా జూలై 4వ ఆదివారాన్ని తల్లిదండ్రుల దినోత్సవం జరుపుకుంటున్నారు. -ఆత్మకూరు

తల్లిదండ్రులు పిల్లలకు మార్గదర్శకులు కావాలి

సమాజంలో తల్లిదండ్రులది ఉన్నతమైన పాత్ర. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించాల్సిన కనీస విషయాలను తెలియపర్చాల్సిన అవసరం ఉంది. సమాజంలో తల్లిదండ్రులు, గురువులను ఎలా గౌరవించాలో పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇంట్లో ఎవరైనా వృద్ధులు ఉంటే వారి పట్ల చూపించాల్సిన ప్రేమానురాగాలను పిల్లలు గ్రహించేలా సేవలు అందించాలి. కాగా నేటి రోజుల్లో తల్లితండ్రులు బిజీబిజీ కార్యకలాపాల వల్ల పిల్లల్ని హాస్టళ్లల్లో వదిలేసి తల్లిదండ్రుల ఆప్యాయతకు దూరం చేయడం వల్ల భవిష్యత్‌లో తల్లిదండ్రుల పట్ల చాలా మంది పిల్లలికి ప్రేమానురాగాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. అంతేగాకుండా ఐదారేళ్ల చిన్నారులను సైతం కిండర్ హాస్టళ్లలో వదిలి బాధ్యతలను తప్పించుకుంటున్న తల్లిదండ్రులు కూడా పిల్లలకు కనీస అవగాహన వచ్చే వరకు వారి సంరక్షణలో ఉంచుకోవడం ఉత్తమమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- తల్లిదండ్రులపై తగ్గుతున్న ప్రేమానురాగాలు
- వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్న పిల్లలు
- జీవిత చరమాంకంలో దిక్కులేని జీవితం
- అండగా నిలిచిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- నేడు తల్లిదండ్రుల దినోత్సవం

జీవిత చరమాంకంలో అండగా ఉండాలి

వృత్తి, సామాజిక, ఆర్థిక పరంగా అనే ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ జీవిత చరమాంకంలో తల్లిదండ్రుల పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలి. వృద్ధాప్యంలో ఒక తోడు కోసం.. ఓ తియ్యని పలుకు కోసం అల్లాడిపోయ్యే తల్లిదండ్రులకు ఆప్యాయతను పంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భార్య చెప్పిందనో.. ఆమె బాధపడుతుందనో, కుటుంబ స్థితిగతులు బాగలేవనో ఇలా అనేక కారణాలతో తల్లిదండ్రులను దూరం చేసుకుంటే భవిష్యత్‌లో తమ పిల్లలు కూడా తమను అలాగే చూస్తారన్న విషయాన్ని గుర్తించుకోవాలి. దయనీయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ప్రేమతో మెలిగినప్పుడే వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది.

వృద్ధులకు అండగా దేశ అత్యున్నత న్యాయస్థానం

సంపాదన లేని తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, పోషణ కోసం సుప్రీంకోర్టు చొరవ తీసుకుంది. ఇందుకుగానూ 2007లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మెయింటెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007 పేరుతో ఓ చట్టాన్ని ప్రవేశపెట్టింది. (ఐపీసీ సెక్షన్ 125(1)) పేరిట పార్లమెంట్‌లో 29.12.2007లో ఆమోదం పొంది అదే నెల 31న భారత రాష్ట్రపతి బిల్లును పాస్ చేశారు. ఈ చట్టం ప్రకారం 60 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరి సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత వాళ్ల పిల్లలు లేదా చట్టప్రకారం నిర్ధారణ పొందిన బంధువులపై ఉంది. అయితే ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ.. పిల్లలు అనే నిర్వచనానికి పరిధి విస్తృత పరిచారు. దీని ప్రకారం పిల్లలు అనే అర్థంలో అల్లుల్లు, కోడళ్లు, మనవళ్లు, దత్తత తీసుకున్న లేదా సవతి తల్లి పిల్లలు, చట్టబద్ధమైన సంరక్షకుల వద్ద ఉన్న మైనర్లు కూడా వస్తారు.

నిర్ణీత పోషణ ఖర్చుల ఎత్తివేత

ఒకప్పుడు వృద్ధుల సంరక్షణకు సంబంధించి గరిష్టంగా పోషణ, సంరక్షణకు నెలకు రూ.10వేలు ఉండేది. అయితే ప్రస్తుత చట్టాల ప్రకారం ఈ నిర్ణీత పోషణ ఖర్చులను ఎత్తివేశారు. పెద్దలు, పిల్లల ఆదాయాన్ని బట్టి ఇవ్వాల్సిన మొత్తాన్ని లెక్కిస్తారు. ప్రత్యేకించి ఆహారం సమకూర్చడం, దుస్తులు, ఉండటానికి అనువైన నివాసం, వైద్య సహకారం అందించాల్సి ఉంది. అయితే ఈ చట్టం ప్రకారం ఎవరైనా ఉద్దేశపూర్వకంగా తల్లిదండ్రులు, వృద్ధులైన బంధువుల సంరక్షణ, పోషణ చూడకుండా నిర్లక్ష్యంగా వదిలేసినా, దూషించినా ఆరు నెలల గరిష్ట జైలు శిక్ష ఉంటుంది. గతంలో ఇది మూడు నెలల మాత్రమే ఉండేది. పలు సందర్భాల్లో జైలు శిక్ష, జరిమానా కూడా విధించవచ్చు.

తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదే



జన్మనిచ్చి, పెంచి పోషించి, ప్రయోజకుల్ని చేసిన తల్లిదండ్రులను చివరిచరమాంకంలో కంటికి రెప్పలా సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉంది. ఇది అందరి నైతిక బాధ్యత కూడా. అయితే ఇటీవల తల్లిదండ్రులను పట్టించుకోని సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే వృద్ధుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకు వచ్చింది. కానీ చట్టాలతో వృద్ధుల సంరక్షణ, పోషణ చూడాల్సిన పరిస్థితికి రావడం దురదృష్టకరం. ఈ విషయంలో సమాజం కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. **- నాగభూషణ్, ఆత్మకూరు రూరల్ సీఐ**

ఈ చట్టం పరిధిలోకి ఎవరెవరు వస్తారంటే..

1. తమ జీవనోపాధి కోసం తాము స్వతహాగా సంపాదించుకోలేని, ఇతర సంపాదన మార్గాలు లేని తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత వాళ్ల పిల్లలదే.
2. ఒకవేళ కొడుకులు లేకుంటే ఆ తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత కూతుళ్ల(అల్లుళ్ల) మీద కూడా ఉంది.
3. పిల్లలు లేక ఎవరైనా దత్తతకు తీసుకుంటే ముసలితనంలో ఆ దంపతుల సంరక్షణ బాధ్యత ఆ పిల్లలదే.
4. వీళ్లే కాకుండా సవతి తల్లికి వృద్ధాప్యంలో ఆలనా, పాలనా చూసే దిక్కు లేకుండా ఆవిడ సంరక్షణ చూడాల్సిన బాధ్యత కూడా పిల్లలపైన ఉంటుంది.

కాగా కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం రూపొందించిన తర్వాత 2011లో తొలిసారిగా తమిళనాడు రాష్ట్రంలో తమ పిల్లలు సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ శిలువాయ్(84), ఆరుమ్మాల్(80) దంపతులు కోర్టును ఆశ్రయించారు. తమ వద్ద ఉన్న రెండు ఇళ్లు, బంగారు నగలు తీసుకుని కొడుకు, కూతుళ్లు తమను పట్టించుకోవడం లేదని ఆ వృద్ధ దంపతులు కోర్టును ఆశ్రయించారు. ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం వృద్ధాప్యంలో ఉన్న వారికి ఎంతో ప్రయోజనం



చేకూరుస్తున్నప్పటికీ అమలులో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ చట్టాన్ని అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వాలకు అంత సులభంగా లేదు. వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణ కష్టతరమైనది. ఈ చట్టాన్ని అమలు చేయడం ఎన్నో సవాళ్లతో కూడుకుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

- తినలేక పడేసిన విద్యార్థులు
- మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



వంట పాత్రలో మాడిపోయిన అన్నం



తహసీల్దార్ కార్యాలయం ముందు భోజనం ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మంత్రాలయం, జూలై 27: మంత్రాలయం జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా తయారైంది. దీంతో భోజనం తినకుండా విద్యార్థులు పందులకు పడేసి పస్తులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థోమాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. ఈ భోజనం తినలేమంటూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తుండగా.. ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర విద్యార్థులను వెంట పెట్టుకుని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ ఉన్నత పాఠశాలలో దాదాపు 1100 మంది విద్యార్థులు భోజనం చేయాల్సి ఉండగా.. దాదాపు 150 మంది మాత్రమే భోజనం చేస్తున్నారని, మిగతా విద్యార్థులందరూ పస్తులుంటూ పాఠశాల తరగతులకు హాజరవుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థోమస్ ఆరోపించారు. మధ్యాహ్న భోజన గది అపరిశుభ్రంగా ఉంది. విద్యార్థులు భోజనం చేసే స్థలంలో పందులు తిరుగుతున్నాయని, వర్షం నీళ్లు నిలిచిపోయాయని అన్నారు. వంట ఏజెన్సీల మీద ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రాలయం ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర మాట్లాడుతూ భోజన నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహానందిని వదలని చిరుత

మరోసారి గోశాల పరిసరాల్లో సంచారం



మహానంది గోశాల పరిసరాల్లో సంచరిస్తున్న చిరుత పులి

మహానంది, జూలై 27: మహానంది పరిసరాల్లోని దేవస్థానం గోశాల వద్ద మరోసారి చిరుతపులి సంచరించింది. క్షేత్రానికి అత్యంత సమీపంలో నల్లమల అటవీ ప్రాంతం ఉండటంతోపాటు పక్కనే ఉన్న గోశాలలోని గోవులపై దాడి చేసేందుకు శుక్రవారం రాత్రి చిరుతపులి సంచరించినట్లు అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీల్లో కనిపించింది. మూడు సార్లు గోశాల పరిసరాల్లో చిరుత సంచరించింది. ఆదే చిరుతపులినా లేక మరొకటి వచ్చిందా అనేది అటవీశాఖ అధికారులు సంచరించిన ప్రదేశంలో పాదముద్రలు పరిశీలించి తేల్చాల్సి ఉంది. చిరుత సంచారంతో మహానంది పరిసరాల్లో నివసించే ప్రజలతోపాటు భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు మాత్రం చిరుత సంచారం వల్ల ప్రజలకు ఎలాంటి హానీ జరగడం లేదని, దీంతో బోను ఏర్పాటు చేసి బంధించేందుకు తమకు అనుమతులు లేవని చెబుతున్నారు. ఉన్నత స్థాయి అధికారుల నుంచి అనుమతి వస్తేనే బోను ఏర్పాటు చేసి బంధించే అవకాశం ఉంటుందని తెలియపరుస్తున్నారు.

సుంకేసుల వద్ద పర్యాటకుల సందడి




సుంకేసుల డ్యాం వద్ద సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు





సుంకేసుల డ్యాం వ్యూ



విద్యుద్దీపాల వెలుగులో తుంగభద్ర డ్యాం

కర్నూలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నురుగులతో పరుగులు పెడుతున్న తుంగభద్రమ్మ అందాలు వీక్షించేందుకు సుంకేసులు బ్యారేజీకి పర్యాటకులు తరలి వచ్చారు. కర్నూలు నగరం నుంచే కాకుండా కర్నూలు, గూడూరు మండలాలు, నది ఆవలి ఒడ్డున ఉన్న తెలంగాణ రాష్ట్రం రాజోలి తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తుంగభద్రమ్మ అందాలు చూసేందుకు తరలి వచ్చారు. అదే క్రమంలో కర్నూలు నగరం మెడలో జలహారంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది అందాలను రైల్వే బ్రిడ్జి, నేషనల్ హైవే, సంకల్‌బాగ్ ప్రాంతాలకు చేరుకొని నది అందాలను వీక్షించారు. తుంగభద్ర డ్యాం 33 గేట్లు ఎత్తి 1.50 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మేలిగనూరుకు చేరిన వరద శుక్రవారం రాత్రి సుంకేసులు ప్రాజెక్టుకు చేరింది. రాత్రే గేట్లు ఎత్తారు. శనివారం 1.02,100 క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో నమోదు కాగా... 28 గేట్లెత్తి 1,01,276 క్యూసెక్కులు నదికి విడుదల చేశారు. 1,540 క్యూసెక్కులు కేసీ కాలువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద వాచ్‌టవర్ ఎక్కితే.. ఓ వైపు పరుగులు పెడుతూ వస్తున్న తుంగభద్ర, జలకళతో తొనికిసలాడే బ్యారేజీ, ఆ బ్యారేజీ గేట్లు దాటి పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర, నదికి సమాంతరంగా పచ్చని పొలాలు దాటుకుంటూ వంపు సొంపులతో సాగిపోతున్న కేసీ కెనాల్ కనువిందు చేస్తున్నాయి. డ్యాం దిగువన చేపల కోసం వచ్చిన కొంగలు, మత్స్యకారుల వేసే వలలు.. ఆకట్టుకుంటున్నాయి. మొత్తంగా సుంకేసుల బ్యారేజీ వద్ద ప్రకృతి పర్యాటకులను తుంగభద్ర అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇదిలా ఉంటే తుంగభద్ర డ్యాం విద్యుద్దీపాలతో వెలుగులీనుతోంది.



చేపల కోసం వల వేస్తున్న మత్స్యకారులు



సెల్ఫీలు తీసుకుంటున్న పర్యాటకులు




కర్నూలు సంకల్‌బాగ్ వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

హెపటైటిస్ ముప్పు

- సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యం
- ముందస్తు వ్యాక్సినేషన్‌తో చెక్
- నేడు వరల్డ్ హెపటైటీస్ డే



కర్నూలు(హస్పటల్), జూలై 27: శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో కాలేయం ఒకటి. జీర్ణక్రియ సాఫీగా సాగాలన్నా, వ్యాధి నిరోధక వ్యవస్థ సక్రమంగా ఉండాలన్నా కాలేయమే ప్రధానం. అయితే గత కొన్నాళ్ళుగా కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అందులోనూ ఎక్కువ మంది హెపటైటీస్ బాధితులు ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. కర్నూలు ప్రభుత్వం సర్వజన వైద్యశాల విభాగానికి ప్రతి నెల 200 మంది హెపటైటీస్ బి బాధితులు గుర్తిస్తున్నారు. హెపటైటీస్ వల్ల కాలేయం పాడవకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నెల 28న ప్రపంచ హెపటైటీస్ డే సందర్భంగా వరల్డ్ హైపటైటీస్ సొసైటీ ఈ ఏడాది ఇది చర్య కోసం సమయం, ప్రపంచస్థాయి హెపటైటీస్‌ను పరిష్కరించడానికి వేగవంతమైన, నిర్ణయాత్మక చర్యల తక్షణ అవసరాన్ని కేంద్రం చేసుకొని పిలుపు ఇచ్చింది. ప్రతి 30 సెకన్లకు ఒకరు హెపటైటీస్‌తో మరణిస్తున్నట్లు సమాచారం.



హెపటైటీస్ ఏబీసీడీఈ అనే వ్యాధుల వైరస్ గురించి ప్రతి ఏటా జూలై 28న ప్రపంచ హెపటైటీస్ నివారణ దినాన్ని జరుపుకుంటారు. ఓపెన్ యాప్ గ్రహీత అయిన డాక్టర్ బరూచ్ బ్లమ్‌బెర్గ్ పుట్టిన రోజును పురస్కరించుకొని దీన్ని నిర్వహిస్తున్నారు. 1960లో హైపటైటీస్ బి వైరస్ (హెచ్‌బీవీ)ని ఈయన కనుగొన్నారు. ద్వాఆ 2008 నుంచి ప్రతి ఏడాది జూలై 28న వరల్డ్ హెపటైటీస్ డే నిర్వహిస్తున్నారు.

ఐదు రకాల వైరస్..

హెపటైటీస్ ఏ.బీ.సీ.డీ.ఈ. అనే ఐదు రకాల వైరస్‌ల వల్ల కాలేయ సమస్యలు వస్తున్నాయి. హెపటైటీస్ అంటే లివర్‌కు కలిగే వైర్ ఇన్‌ఫెక్షన్ వీటిలో ఏడీఏ రకాలు ప్రమాదకరమైనవి కావు. ఇవి కలుషిత ఆహారం, నీటిని తీసుకోవడం వల్ల వస్తాయి. కొద్దిరోజుల పాటు పచ్చకామెర్లు వచ్చి తగ్గిపోతాయి. కాని బీ.సీ. వైరస్ మాత్రం ప్రమాదకమైనదిగా వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే లివర్ సిరోసిస్ (క్యాన్సర్) దశకు చేరి ప్రాణహాని కలుగుతుంది.

ఈ రెండింటితో సమస్య..

హెపటైటీస్ బి కలుషిత రక్తం, సిరంజులు, సూదులు వినియోగించడం, అసురక్షితమైన లైంగింగక సంపర్కం మొదలైనవాటి వల్ల వస్తుంది. ఇది తల్లి నుండి బిడ్డలకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధి బారిన పడిన వారిలో 80 వాతం మందికి అసలు విషయం తెలియదు. హెపటైటీస్ బి బాధితుల్లో 20 శాతం మంది లివర్ సిర్రోసిస్ (కాలేయం పూర్తిగా దెబ్బతిని పనిచేయదు) బారినపతారు. దీనిని క్రానిక్‌లివర్ డీసీజ్ అంటారు. భారతదేశంలో హెపటైటీస్ బాధితులకు జనాభాలో 4-5 శాతం మంది ఉన్నారు. పచ్చ కామెర్లతో కూడిన జ్వరం ఎక్కువ రోజుల పాటు వేధిస్తుంది. హెపటైటీస్ బీవీ స్కీనింగ్ టెస్టు ద్వారా గుర్తించవచ్చు.

526 హెపటైటిస్-సీ కేసులు గుర్తించాం



2023 ఏప్రిల్ నుంచి 2024 జూలై 15వ తేదీ వరకు ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించగా.. 526 మందికి హెటైటిస్-సీ ఉన్నట్లు గుర్తించి చికిత్స అందించాం. ప్యాపిలి మండలంలో ఈ కేసులు అధికంగా వెలుగు చూస్తున్నాయి. ఇక పక్కనున్న గద్వాల జిల్లాలోని అయిజ, వడ్డెపల్లి, రాజోలి మండలాల్లో కూడా అధికంగా కేసులు వస్తున్నాయి. హెపటైటిస్ బీ, సీ వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటి వరకు పది వేల మందికి వ్యాక్సినేషన్ వేశాం.

- డా.జి.మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగం

హెపటైటిస్ లివర్‌కు వచ్చే సమస్య



హెపటైటీస్ వైరస్ లివర్‌కు వచ్చే సమస్య. చాలా మంది వ్యాధి ముదిరిన తరువాత వైద్యం కోసం వస్తున్నారు. ఈ వైరస్‌లు రాకుండా ఉండాలంటే వ్యక్తి శుభ్రం పాటించడం, కలుషిత నీటికి, ఆహారానికి దూరంగా ఉండాలి.

-డా.పి. అబ్దుల్ సమద్
గ్యాస్ట్రోఎంటారాలజిస్టు, కర్నూలు మెడికల్ హాస్పిటల్

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, జూలై 27: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. శని, ఆదివారం నెల ఆఖరి దినాలు కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు రథోత్సవాలలో పాల్గొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు.

మద్యం రవాణా కేసులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

జిల్లా ఎన్ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్

ఆదోని, జూలై 27: జిల్లాలో అక్రమ మద్యం రవాణా కేసుల పురోగతిపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తనిఖీ చేసి అనంతరం సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడారు. విధి నిర్వహణలో సిబ్బంది సమస్యలపై ఆరా తీశారు. శాఖ ప్రతిష్టను పెంచేలా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్టేషన్లో రికార్డులపని పెండింగ్ లేకుండా సక్రమంగా నిర్వహించాలని అన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో విధిగా పర్యటించాలని సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు విన్నిలత, భార్గవరెడ్డి, స్వర్ణలత పాల్గొన్నారు.

సుంకేశ్వరి పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

విధుల్లో నిర్లక్ష్యమే కారణం

మంత్రాలయం, జూలై 27: మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామ పంచాయతీ సెక్రటరీ చిరంజీవిపై సస్పెన్షన్ వేటు పడింది. శనివారం కలెక్టర్ రంజిత్ బాషా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16వ తేదీన సుంకేశ్వరిలో అతిసారా సోకి మూడేళ్ల చిన్నారి జ్యోతి మృతి చెందిన విషయం తెలిసిందే. గ్రామంలో దాదాపు 70 మందికి పైగా అస్వస్థతకు గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండటంతో అప్పటి జేసీ, ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీపీవో, డీఎంహెచ్‌వో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వంటి ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై తీవ్రంగా మండిపడ్డారు. దీనికంతటికీ కారణం గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి చిరంజీవి విధి నిర్వహణలో నిర్లక్ష్యమని నాటి జేసీ నివేదిక ఇచ్చారు. ఈ మేరకు ఆయనను శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్లన్న సన్నిధిలో కార్మిక శాఖ మంత్రి



ఆలయ ప్రాంగణంలో మంత్రి వాసమ్‌శెట్టి సురేష్

శ్రీశైలం, జూలై 27: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసమ్‌సెట్టి సురేష్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు వచ్చిన మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామివారికి అభిషేకం, భ్రమరాంబదేవి అమ్మవార్లకి కుంకుమార్చన జరిపించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రికి వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

ఇద్దరు కార్పొరేటర్ల నామినేషన్ ఉపసంహరణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 27: నగరపాలక సంస్థ స్థాయి సంఘ కమిటీ సభ్యుల ఎన్నికలకు ఇద్దరు కార్పొరేటర్లు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో 50వ వార్డు ఎస్‌టీ. షేక్ అహ్మద్, 1వ వార్డు కార్పొరేటర్ పి.షాషావలి.. కార్యదర్శి నాగరాజు, మేనేజర్ చిన్న రాముడుకు ఉపసంహరణ పత్రాలు అందజేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలతో ఉపసంహరణ ప్రక్రియ ముగియనుంది. తరువాత అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయనున్నారు. క్లర్క్ జీఎం. శ్రీకాంత్ పాల్గొన్నారు.

నంద్యాలలో ఈఎన్‌టీ వైద్యుల రాష్ట్ర సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రైతులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 27: నంద్యాలలో ఏపీ ఈఎన్‌టీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో 15వ రాష్ట్ర స్థాయి ఈఎన్‌టీ వైద్య వైజ్ఞానిక సదస్సు శనివారం ప్రారంభమైంది. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. జాతీయ స్థాయి ప్రముఖ ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ మధుసూదన్‌రావు, జాతీయ ఈఎన్‌టీ వైద్య సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయేంద్ర, ఏపీ మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా వైద్యులు అధునాతన పద్ధతుల ద్వారా శస్త్ర చికిత్సలు చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ, తెలంగాణాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది ఈఎన్‌టీ వైద్యులు సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ దస్తగిరి రెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: పంచాయతీరాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్, కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశాల మేరకు పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఒక ప్రత్యేక సెల్‌ను 08518-277278 ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పని దినాలలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పారిశుధ్యం, తాగునీటి సమస్యలను ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. మహిళ దుర్మరణం

బేతంచెర్ల, జూలై 27: మండలంలోని బలపాలపల్లె గ్రామ సమీపంలో నాపరాళ్ల లోడు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడగా.. ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న శశికళ (29) కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన శనివారం జరిగింది. పాపసాని కొట్టాల గ్రామానికి చెందిన మధు భార్య శశికళ కోడిగుడ్లు తీసుకురావడానికి బలపాలపల్లి గ్రామానికి వచ్చింది. స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న సమయంలో రోడ్డుపై ఉండగా.. పలుకూరు నాపరాళ్ల గనుల నుంచి నాపరాళ్ల లోడుతో బలపాలపల్లె మీదుగా పాపసాని కొట్టాల వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను శశికళ ఎక్కింది. ఎత్తయిన రోడ్డు మీదికి ఎక్కుతుండగా.. అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో శశికళపై నాపరాళ్లు పడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. బేతంచెర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శశికళ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియా కూటమితో జగన్ దోస్తీ

- సీఎం హోదాలో ఉన్నప్పుడు దోపిడీ
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), జూలై 27: ఇండియా కూటమితో జగన్ దోస్తీ కోసం.. ఢిల్లీ పర్యటన చేపట్టాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆనాడు రూ.కోట్ల అక్రమ సంపాదన కేసులో వైఎస్ జగన్ 16 నెలలు జైలులో ఉండివచ్చారని అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి.. మరోసారి భారీ ఎత్తున అక్రమాలతో రాష్ట్ర సంపాదన దోచేశారని విమర్శించారు.

మంత్రాలయం వద్ద ఉత్తుంగభద్ర

- గంగమ్మ గుడిని చుట్టుముట్టిన వరద నీరు
- నదీ తీరం వద్ద పోలీసుల గస్తీ, గజ ఈతగాళ్ల ఏర్పాటు
- మంత్రాలయం వద్ద 311.270 మీటర్ల నీటి మట్టం
- నదీ తీరాల్లో మునిగిన విద్యుత్ మోటార్లు, పంటలు



మంత్రాలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర

మంత్రాలయం, జూలై 27: తుంగభద్రమ్మ పరవళ్లతో శనివారం సాయంత్రం మంత్రాలయం వద్ద స్నానఘట్టాలన్నీ మునిగిపోయాయి. నదీతీరంలో ఉన్న గంగమ్మ గుడిని వరద నీరు చుట్టేసి ఉగ్ర రూపం దాల్చింది. హొస్పేట్‌లోని తుంగభద్ర డ్యాం నుంచి 1,41,485 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నది దిగువకు విడుదల చేయడంతో మంత్రాలయం వద్ద 311.270 మీటర్ల నీట మట్టంతో 1.28 లక్షల క్యూసెక్కులతో ప్రవాహం ఊపందుకుంది. నది తీర గ్రామాల్లోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం మండలాల్లోని నదీతీర గ్రామాల్లో వందలాది ఎకరాలు నీటిలో మునిగిపోయాయి. విద్యుత్ మోటార్లు కొన్ని మునిగిపోగా.. కొంత మంది రైతులు మోటార్లను తీసేసి సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. మంత్రాలయం వద్ద పుణ్యస్నానాలకు భక్తులు వెళ్లకుండా శ్రీమఠం అధికారులు ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర, ఎస్‌ఐ గోపినాథ్, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో పోలీసు, మఠం సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తగా పుట్టీలతో కూడిన గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. సాయంత్రం గ్రామస్థులు, భక్తులు తుంగభద్రమ్మ జలకళను ఆనందంగా తిలకించారు.

నాగలదిన్నె వద్ద తుంగభద్ర జలకళ

నందవరం: నాగలదిన్నె గ్రామం దగ్గర ఉన్న తుంగభద్ర నదికి డ్యాం నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. డ్యాం నుంచి తుంగభద్ర నదికి 95వేల క్యూసెక్కుల నీరు విడుదల అయింది. దీంతో తీర గ్రామాలైన నాగలదిన్నె, నదికైరవాడి, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురుజాల, జోహరాపురం రాయచోటి, గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కోరారు. పంపు మోటర్ల దగ్గరకు రైతులు వెళ్లకుండా అధికారులు చూడాలన్నారు.

మతిస్థిమితం లేని రోగి వీరంగం

- వైద్య పరికరాలు ధ్వంసం
- సిబ్బందిపై దాడి..
- రోగిని స్తంభానికి కట్టేసిన ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది
- రోగి ఆరేకల్ గ్రామానికి చెందిన రాఘవేంద్రగా గుర్తింపు



వీరంగం సృష్టిస్తున్న మానసిక రోగి రాఘవేంద్ర

ఆదోని, జూలై 27: ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మతిస్థిమితం లేని రోగి వీరంగం సృష్టించాడు. సెక్యూరిటీ సిబ్బంది అడ్డగించడంతో వారిపై కూడా దాడి చేశాడు. సెలైన్ బాటిల్ ఎక్కించే స్టాండు తీసుకొని ఆస్పత్రిలోని వైద్య పరికరాలను ధ్వంసం చేసి భయానకర వాతావరణం సృష్టించాడు. మండలంలోని ఆరేకల్లు గ్రామానికి చెందిన రాఘవేంద్ర (30)కు గతవారం రోజులుగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం శనివారం ఆదోని హాస్పిటల్‌కి తీసుకొచ్చారు. క్యాజువాలిటీ వార్డులో తనకు చికిత్స చేస్తున్న వైద్య ఇసబ్బందిని చూసి కొంత భయానికి గురైన రాఘవేంద్ర కేకలు వేస్తూ సిబ్బందిపై దాడికి పూనుకున్నాడు. అక్కడే సెలైన్ బాటిల్ ఎక్కించేందుకు ఉన్న స్టాండ్‌ను తీసుకొని మల్టిపెరా మానిటర్, ఇన్ఫ్యూషన్ పంప్, పారా మానిటర్, ఫ్యాన్‌లను ధ్వంసం చేశాడు. సెక్యూరిటీ సిబ్బంది అతి కష్టం మీద పట్టుకొని తాళ్లతో స్తంభానికి కట్టేశారు. పోలీసులు వచ్చి అతడ్ని విడిపించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. అనంతరం రాఘవేంద్ర చిన్నాన్న లక్ష్మన్న చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లారు. రాఘవేంద్ర వీరంగంలో ఆసుపత్రిలో రూ. రెండు లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు వైద్య అధికారి శ్రీనివాస నాయక్ తెలిపారు. వన్ టౌన్ సీఐ తేజమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమలలో కారును ఢీకొన్న లారీ

వాహనాల రాకపోకలకు అంతరాయం

మహానంది, జూలై 27: మహానంది మండలం నల్లమల ఘాట్ గిద్దలూరు- నంద్యాల ప్రధాన రహదారిలో శనివారం రెండు ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్నాయి. దీంతో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గిద్దలూరు నుంచి నంద్యాల వైపు వస్తున్న కారును చింతమాను మలుపు వద్ద ఇరుకుగా ఉన్న రహదారిలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వాహనాలు రహదారికి అడ్డంగా పడ్డాయి. వాహనాలు ఎటూ పోలేక నిలిచిపోయాయి. చివరికి వాహనదారులే చొరవ తీసుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును అతి కష్టమ్మీద పక్కకు తొలగించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దపులి దాడిలో బర్రె మృతి

ఆత్మకూరురూరల్, జూలై 27: ఆత్మకూరు మండలం వడ్లరామాపురం గ్రామ శివార్లలో బర్రెలపై పెద్దపులి దాడి చేయడంతో శనివారం ఓ బర్రె మృతి చెందింది. మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామానికి చెందిన నారాయణ అనే వ్యక్తికి చెందిన మూడు బర్రెలను మేపేందుకు గ్రామ శివార్లలోని పొలాలకు శుక్రవారం సాయంత్రం తీసికెళ్లాడు. పొదల మాటు నుంచి వచ్చిన ఓ పెద్దపులి దాడి చేసింది. అక్కడ పొలాల్లో పని చేసుకుంటున్న రైతుల కేకలు వేయడంతో ఆ పులి పారిపోయింది. తీవ్ర గాయాలపాలైన బర్రెను ఆత్మకూరు పశువైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

డిపార్టుమెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: నేటి నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించనున్న డిపార్టుమెంట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మధుసూదన్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం డీఆర్వో చాంబరులో డిపార్టుమెంట్ పరీక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో డీఆర్వో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ నగరంలోని సనత్ నగర్ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో డిపార్టుమెంట్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ షాహీదా, ఏపీపీఎస్సీ ఏఎస్‌వో అనిల్ పాల్గొన్నారు.

స్కానింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకపోవడంపై ఆగ్రహం



న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్‌లో తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హస్పటల్), జూలై 27: రేడియాలజీ విభాగంలో అల్ట్రాసౌండ్ పరీక్షలను అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేకుండా పీజీలు నిర్వహించడంపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన పలు విభాగాలను తనిఖీ చేశారు. న్యూడయోగ్నస్టిక్ బ్లాకులోని స్కానింగ్ కోసం గర్భిణిలు వెయిట్ చేస్తున్నారని, 8 స్కానింగ్ కేంద్రాల్లో పీజీ విద్యార్థులే చేస్తుండటం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సగం స్కానింగ్ మిషన్లు మీద ఉండాలనే నియమం ఉన్నా పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి బీవీ సేవలు మరువలేం

ఉలిందకొండ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, తదితరులు

కల్లూరు, జూలై 27: పేదప్రజల ఆశాజ్యోతి, నిరాడంబరుడు మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి సేవలు ఎన్నటికీ మరువలేమని ఆయన తనయుడు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగ్రామం ఉలిందకొండ గ్రామంలో నిర్వహించిన 12వ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆయన ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత నందమూరి తారకరామారావుకు అత్యంత సన్నిహితుడిగా తన తండ్రి పేరొందారని అన్నారు. టీడీపీలో అనేక పదవులు అలంకరించి ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా పనిచేశారని కొనియాడారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడుతో తన తండ్రికి విడదీయరాని అనుబంధం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు టీడీపీ మున్సిపల్ మాజీ చైర్మన్ కొండయ్య, ఎమ్మిగనూరు కౌన్సిలర్ రామ్‌దాస్‌గౌడ్, టీడీపీ సీనియర్ నాయకులు నాగరాజుగౌడ్, కాసీంవలి, చిన్నరాముడు, రంగస్వామిరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గౌరు దంపతులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గౌరు దంపతులు

కల్లూరు, జూలై 27: కర్నూలు జిల్లా నూతన కలెక్టర్ పి. రంజిత్ బాషాను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్‌ను గౌరు దంపతులు అభినందనలు తెలిపారు.

సుంకేశ్వరి పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: మంత్రాలయం మండలం సుంకే శ్వరి గ్రామంలో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించినందుకు గ్రా మ పంచాయతీ కార్యదర్శి చిరంజీవిని కలెక్టర్ పి.రంజిత్ బాషా సస్పెండ్ చేశారని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు శనివారం తెలిపారు. జిల్లాలోని పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'హామీలు అమలు చేయాలి'

కర్నూలు(కల్చరల్), జూలై 27: టీడీపీ ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. శనివారం సమాఖ్య నగర ఆఫీస్ బేరర్ల సమావేశం నగర కార్యదర్శి వి. భారతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గిడ్డమ్మ, శ్రావణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచితంగా ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు, మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ఆఫీస్ బేరర్లు ఆదిలక్ష్మి, అంజలి, పావని, శైలజ, మల్లేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూజల పేరుతో మోసం

రూ.50 వేలు స్వాహా

కర్నూలు, జూలై 27: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పూజలు చేస్తామని నమ్మించి ఓ వృద్ధురాలిని, ఆమె కోడల్ని దొంగ పూజారులు మోసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక నాగప్పవీధికి చెందిన పద్మాబాయి అనే వృద్ధురాలు తన కోడలుతో కలిసి ఉంటుంది. కొడుకు రైల్వేలో చిరు ఉద్యోగి. శుక్రవారం వీరింటికి భిక్షాటనకు ఓ ఇద్దరు పూజారులు వచ్చారు. మొదట బియ్యం వేయాలని కోరడంతో ఆమె బియ్యం వేసింది. ఆ తర్వాత మీ ఇంట్లో సమస్యలు ఉన్నాయంటూ కొంచెం భయాన్ని సృష్టించారు. మీ కొడు కుకు ప్రాణగండం ఉందంటూ మరో అడుగు ముందుకేసి ఆమెలో మరికొంత భయాన్ని ఉసి గొల్పారు. మీ కొడుకుకు ప్రాణగండం తప్పాలంటే కొన్ని పూజలు చేయాలన్నారు. పెద్దగా ఖర్చు కాదని, మీరే నదికి వెళ్లి స్వయంగా పూజలు చేయాలన్నారు. మీతో పాటు 11 మంది పిల్లలను తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. వేరే పిల్లలను ఎవరూ కూడా పంపరు కదా అని ప్రశ్నిస్తే.. ఆ పని కూడా మేమే చేస్తామంటూ నమ్మించారు. చేసేదేమీ లేక ప్రాణభయంతో వృద్ధురాలు తన ఇంట్లో ఉన్న రూ.30వేలు వారి చేతికి ఇచ్చింది. ఆ తర్వాత ఆ పూజారులు మరి కొన్ని భయాలు సృష్టించి రూ.20వేలు లాక్కున్నారు. దీంతో ఆ వృద్ధురాలు శనివారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు శనివారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లి విచారిస్తే వీరితో పాటు ఆ ఏరియాలో మరి కొంత మందిని కూడా ఇదే తరహాలో మోసం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఓ ఇంట్లో రూ.3వేలు, మరో ఇంట్లో బియ్యం.. ఇలా వచ్చిన కాడికి దోచేశారు. పోలీసులు ఆ పూజారుల కోసం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇంతియాజ్ తెలిపారు.

శ్రీవారి కుటీర్‌లో చోరీ యత్నం

కర్నూలు, జూలై 27: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జొహరాపురం రోడ్డులో ఉన్న శ్రీవారి కుటీర్ కాలనీలో మూడు ఇళ్లల్లో చోరీ యత్నం జరిగింది. శ్రీవారి కుటీర్ కాలనీలో నివాసముంటున్న ఆర్టీసీ రిటైర్డ్ డీఎం దస్తగిరి రెండు రోజుల కింద కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఈయన ఇంట్లో చోరీ యత్నం చేశారు. అయితే.. ఈయన నగదు, నగలు, బీరువాలో కాకుండా ఒక సపరేటు లాకర్‌లో ఉంచడంతో చోరీకి గురి కాలేదు. ఆ తర్వాత అదే కాలనీలో నివాసముండే రవి అనే మున్సిపల్ టీచర్ ఇంట్లో చోరీ యత్నం జరిగింది. ఈయన కుటుంబ సభ్యులతో కలిసి వేంపెంట వెళ్లాడు. దొంగలు ఈయన ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న చీరలు, దుస్తులు కిందకు లాగేసి లాకర్‌ను తెరిచి చూసి చూశారు. ఏమీ కనిపించకపోవడంతో వెనుదిరిగి పోయారు. మరో ఇంట్లో తలుపు తాళం పగులకొట్టి లోపల చూశారు. అక్కడా ఏమీ లేకపోవడం వెనుదిరిగి వెళ్లారు. బాధితులు శనివారం ఇండ్లకు వచ్చి చూసి చోరీ యత్నం తీరును గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 కేసులు నమోదు

కర్నూలు, జూలై 27: నగరంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం రాత్రి 13 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సుంకేసుల రోడ్డులోని సంజీవిని హాస్పిటల్ దగ్గర ట్రాఫిక్ సీఐ గౌతమి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 09 ద్విచక్ర వాహనదారులు, కారు, మూడు ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ గౌతమి తెలిపారు.

అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి

» ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలి
» ఎస్పీ బిందు మాధవ్



మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

కర్నూలు, జూలై 27: జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ట్రాఫిక్‌పై ఆర్టీసీ, ట్రాన్స్‌కో, నేషనల్ హైవే అథారిటీ, మున్సిపల్, పోలీసు ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారుల భద్రతకు అవసరమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని, ముఖ్యమైన రహదారులు, రద్దీ ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే నేర నివారణకు దోహదపడుతాయన్నారు. పని చేయని సీసీ కెమెరాల లోటుపాట్లు తెలుసుకుని అవి పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన మలుపుల వద్ద బారికేడ్లు, స్టాపర్స్ ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ అధికారి అధికారులను ఆదేశించారు. నగరంలో ఆటోలు ఇతర వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఫ్రీలెఫ్ట్‌గా వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ బస్టాండులోకి వెళ్లి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకునే విధంగా ఆటోలకు ఒక స్థలం కేటాయించేందుకు పరిశీలన చేయాలన్నారు. రైల్వేస్టేషన్‌కు గూడ్స్ రైళ్లలో వచ్చే రైస్‌ను గోడౌన్లకు తరలించే లారీలు పట్టణంలో రాత్రి వేళలో మాత్రమే తిరిగే విధంగా చూడాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కలిగే విధంగా కరెంటు పోల్స్ ఉంటే వాటిని కూడా పరిశీలించాలని తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయంపై తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ సీఐ గౌతమికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు మహబూబ్ నగర్, కడప, అనంతపురం డివిజ నల్ అధికారులు, మున్సిపల్ అధికారులు, డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరిరాజు, ఏఈ ప్రవీణ్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శభరీష్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐ గౌతమి, డీటీఆర్‌బీ సీఐ ఆదినారాయణ రెడ్డి, ట్రాన్స్‌కో అధికారులు, సీఐ పార్థసారధిరెడ్డి, ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

'అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి'



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు(అర్బన్), జూలై 27: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బహుజన సేవా సమితి అధ్యక్షుడు కే.గిడ్డన్న అన్నారు. శనివారం నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ హైస్కూల్‌లో మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే డా.అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అబ్దుల్ కలాం జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించడం జరిగింది. వారిని ఆదర్శంగా తీసుకుని బావి భారత పౌరులుగా ఉన్నత స్థానంలో ఎదగడానికి విద్యార్థి దశలోనే విద్యాసక్తితో చదువుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.శారదమ్మ, పి.శివప్రసాద్, ఎస్.కర్ల, సి.నరసింహ, దినేష్, భాస్కర్, ఇబ్రాయిల్, అబిషేక్ పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): భారతదేశపు మిస్సైల్ మ్యాన్ అబ్దుల్ కలాం బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. నాగస్వామి నాయక్ అన్నారు. శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ క్షిపణి అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్ కలాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, ఉల్లోజి రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): శాస్త్ర, సాంకేతిక రంగంలో దేశాన్ని ప్రపంచ చిత్రపటంలో ఉన్నత స్థానంలో నిలబెట్టిన నిస్వార్థ సేవకుడు అబ్దుల్ కలాం అని లయన్ డాక్టర్ రాయ పాటి శ్రీనివాస్ కొని యాడారు. శనివారం నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఏపీవో అవిధేయతపై చర్యలు తీసుకోవాలి

» సమావేశంలో కాలు మీద కాలేసుకొని కూర్చోవడమే నేరం
» అవమానంగా భావించిన మండల స్థాయి అధికారులు, రాజకీయ నేతలు



సర్వసభ్య సమావేశంలో కాలుమీద కాలు వేసుకొని కుర్చున్న ఏపీవో

కోడుమూరు, జూలై 27: మండల సర్వసభ్య సమావేశంలో ఏపీవో కాలు మీద కాలేసుకొని కూర్చోవడం అధికారులకు అవిధేయతగా కనిపించింది. ఆయన్ను సస్పెండ్ చేయాలని అధికారులు, రాజకీయ నాయకులు కోరుతున్నారు. శనివారం కోడుమూరు మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేదికపై మండల అధ్యక్షురాలు రూతమ్మ, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీవో దివ్య, తహసీల్దార్ గుర్రప్ప ఉన్నారు. సమావేశంలో ముందు వరుసలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో మోదీన్‌బాషా కాలు మీద కాలు వేసుకొని కుర్చున్నాడు. దీన్ని వేదిక మీద ఉన్న రాజకీయ నాయకులు సహించలేకపోయారు. పక్కన కుర్చున్న మండల స్థాయి అధికారులు అవమానంగా భావించారు. చివరికి ఆయన సభా మర్యాద పాటించలేదనే ఆరోపణతో సస్పెండ్ చేయాలని రాజకీయ నేతలు డిమాండ్ చేశారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు



ట్రాన్స్‌పోర్టులో రసీదులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

కోడుమూరు, జూలై 27: రైతులకు నకిలీ మందులు, విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారిని పీఎల్ వరలక్ష్మి హెచ్చరించారు. కోడుమూరు పట్టణంలోని ఎస్ఆర్ ఎంటీ, క్రాంతి ట్రాన్స్‌పోర్టును శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భం గా ట్రాన్స్‌పోర్టుకు వచ్చిన పెస్టిసైడ్, విత్తనాలకు సంబంధించిన రసీదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ గ్లైఫోసిట్ అనే గడ్డి మందును ప్రభుత్వం నిషేధించిందన్నారు. అను మతి లేని పెస్టిసైడ్, విత్తనాలు విక్రయించే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అనంతరం కిసాన్ అగ్రిమాల్ దుకాణాన్ని ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ ఖాద్రి, మండల వ్యవసాయ అధికారి రవిప్రకాష్ పాల్గొన్నారు.

అంతర్వేదిలో కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి



ఎమ్మెల్యే దస్తగిరికి దేవుని చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 27: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తూర్పుగోదావరి జిల్లా రాజోలులోని అంతర్వేదిలో లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం ఆయన అంతర్వేది వెళ్లగా అలయ ఈవో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనిషిని మానసికంగా ఉన్నతున్ని చేస్తాయన్నారు.

రీచ్‌ల దగ్గర మాత్రమే ఇసుక తవ్వుకోవాలి : ఎస్ఐ

కోడుమూరు, జూలై 27: ప్రభుత్వం అనుమతి ఇచ్చిన రీచ్ దగ్గర మాత్రమే ఇసుకను తవ్వుకోవాలని ఎస్ఐ బాలనరసింహులు అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న హంద్రీ నదిలో ఇసుక తవ్వుకోవడం నేరం అన్నారు. అలాగే పట్టణంలోని హంద్రీ నదిలోని మంచినీటి పథకాల దగ్గర ఉన్న ఇసుకను ఎండ్ల బండ్లు తీసుకెళ్లున్నారని పంచాయతీ అధికారుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దాదాపు 30 ఎండ్లబండ్లకు రూ.2వేల చొప్పున జరిమానా విధించామని అన్నారు. ప్రభుత్వం నిబంధనల మేరకు రీచ్ దగ్గర ఇసుకను తెచ్చుకోవాలి. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీవో దివ్య ఎంపీపీ రూతమ్మ, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ అధికారి రవిప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'శిక్షణ తరగతులను విజయవంతం చేయండి'

కర్నూలు(కల్చరల్), జూలై 27: అన్నమయ్య జిల్లా మదనపల్లిలో ఈనెల 29వ తేదీ నుంచి 31 వరకు జరుగనున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులకు 26 జిల్లాల నుంచి సంఘం నాయకులు, కార్యకర్తలు హాజరు అవుతున్నారని, జిల్లాలో పాణ్యం నియోజక వర్గం నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు రామాంజినేయులు, సురేంద్ర యాదవ్, హేమంత్‌కుమార్, పుల్లన్న, మహ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి: ఏఈ

సి.బెళగల్, జూలై 27: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ లబ్ధిదారులకు సూచించారు. శనివారం మండలంలోని కంబందహాల్, సి.బెళగల్, పోలకల్లు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇళ్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ఆయన పరి శీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసిన వారందరికీ బిల్లులు మంజూరు చేస్తామన్నారు. అధికారులు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

గూడూరు, జూలై 27: పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ సునిల్ కన్నా అన్నారు. శని వారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఎంపీడీవో విజయసింహా రెడ్డితో కలిసి స్పెషల్ డ్రైవ్ కింద గూడూరు మండలం గుడిపాడు గ్రామాన్ని సందర్శించి శానిటేషన్, తాగునీటి సరఫరాపై చర్చించారు. అనంతరం పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్రైనేజీలు, నీటి నిల్వ ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. జడ్పీ హైస్కూల్‌లో పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

వీధి కుక్కల దాడి నుంచి ప్రజలను కాపాడాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 27: వీధి కుక్కల దాడి నుంచి ప్రజలను కాపాడాలని కోరుతూ శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాధితులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుల్లారెడ్డి మాట్లాడుతూ నగరంలో చిన్న పిల్లలు వృద్ధులపై కుక్కలు దాడి చేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో బాలరాజు, మక్బుల్, శ్రీనివా సులు, షరీఫ్, విజయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 27: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీల నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ తెలిపారు. సీనియర్ మోస్ట్ స్కూల్ అసిస్టెంట్లు, లేకుంటే సీనియర్ మోస్ట్ పీఈటీ ఉపాధ్యాయులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. పూర్తి వివరాలతో ధృవపత్రాలను 29వ తేదీలోపు డీఈవో కార్యాలయానికి పంపాలన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీవీఈవో

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 27: కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి అందజేయనున్న ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జి.లాలెప్ప అధ్యక్ష తన జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి, కళాశాల విశ్రాంత ప్రిన్సి పాల్ కేచెన్నయ్య పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు నోటు పుస్తకాలు, టెక్స్ బుక్స్ బ్యాగులు అందజేస్తార న్నారు. డీవీఈవో మాట్లాడుతూ విద్యార్థినుల హాస్టల్ సౌకర్యాల కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ జూనియర్ కళాశాల టౌన్‌లో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక క్రమ పద్ధతిలో చదివితే నీట్ పరీక్షల్లో అర్హత సాధించవచ్చన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పరమేశ్వరరెడ్డి, ఆర్ఐవో గురువయ్యశెట్టి, కే.చెన్నయ్య, డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో ఒలింపిక్ వలయాల ఆకృతిలో విద్యార్థులు



కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 27: ప్యారిస్‌లో ప్రారంభమైన 33వ ఒలింపిక్ క్రీడల ప్రారంభోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక ఎ. క్యాంపు మాంటిస్సోరి పాఠశాలలో దాదాపు 600 మందికి పైగా విద్యార్థులు ఒలింపిక్ పతాకంలోని ఐదు ఖండాలను తెలియజేసే ఐదు రింగుల ఆకృతిలో మానవ వలయాలుగా ఏర్పడ్డారు. తద్వారా ఈ విశ్వ క్రీడల్లో పాల్గొంటున్న 117 మంది భారత క్రీడాకారులకు తమ మద్దతును, శుభాకాంక్షలను తెలియజేశారు.

ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 27: ప్రకృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యువజన సర్వీసుల శాఖల సెట్కూరు సీఈవో పీవీ రమణ అన్నారు. శనివారం బీ. క్యాంపులోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సెట్కూరు ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఈవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, విద్యుత్ శక్తిని ఆదా చేసి ఎల్ఈడీలాంటి ఉపకరణాలను వాడాలన్నారు. ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పోస్టర్ మేకింగ్ ప్రెజంటేషన్ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే. హేమంత్, అధ్యాపకులు ఎస్. సత్యనారాయణ, డా. కమ్లీ నైక్, డా.కే. సిప్పి ఇసాక్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు సమాన హక్కులు ఇవ్వాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 27: సమాజంలో ప్రతి ఒక్కరికీ హక్కులు ఉన్నట్లే ట్రాన్స్‌జెండర్స్ కూడా సమాన హక్కులు ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆసుపత్రిలో ధన్వంతరి హాలు ట్రాన్స్‌జెండర్‌ల ఆరోగ్య సమస్యలపై వీహెచ్ఎస్‌సీడీసీ ప్రాజెక్టు, యాస్పైర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆసుపత్రి సూపరింటెండెంట్, అడిషనల్ డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్ హాజరయ్యారు.

మద్యం పట్టివేత

కోడుమూరు (రూరల్), జూలై 27: కోడుమూరు సెబ్ పోలీసులు వేర్వేరు చోట్ల జరిపిన విస్తృత దాడుల్లో 282 బాటిళ్ల అక్రమ మద్యం పట్టుకున్నారు. సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలివి.. గూడూరు మండలంలో తెలంగాణ మద్యం తరలిస్తున్న ఆటోను గుర్తించి పట్టుకుని, ఆటోలోని 116 మద్యం బాటిళ్లు సీజ్ చేసి మోహనరంగడు అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. అలాగే క్రిష్ణగిరి మండలంలోని మన్నె కుంటలో సింగం మాధవస్వామి అనే వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం 96 టెట్రా ప్యాకెట్లు, ఎస్‌హెచ్ ఎర్రగుడికి చెందిన లక్ష్మమ్మ వద్ద 70 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో చెక్‌పోస్టు సీఐ మల్లిక సెబ్ స్టేషన్ ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వెంకటేష్ నాయక్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో



రికార్డును పరిశీలిస్తున్న డీఈవో శామ్యూల్

ఓర్వకల్లు, జూలై 27: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ అన్నారు. శనివారం ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ ఏడాది పది విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షలకు హాజరవుతున్న సందర్భంగా గత సంవత్సరం సంబంధిం చిన విద్యార్థుల మార్కుల పేపర్లు, రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఓంకార్ యాదవ్, ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రణాళికతో చదవాలి'

గూడూరు, జూలై 27: ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి ఉద్యో గాలు పొందవచ్చునని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గోకారి అన్నారు. శనివారం సెట్కూరు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గూడూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల (బాలురు)లో వ్యక్తిత్వ వికాస, కెరీర్ కౌన్సెలింగ్, ఉపాధి అవకాశాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాజశేఖర్ మాట్లాడుతూ ఉన్నత విద్యావకాశాలు, ప్రస్తుత ఉపాధి అవకాశాలు, పరీక్షలకు, ఇంటర్వ్యూలకు ఏ విధంగా సన్నధం కావాలి అన్నది తెలియజేసారు.

'చెట్ల సంరక్షణపై అవగాహన కల్పించాలి'

కర్నూలు(కల్చరల్), జూలై 27: చెట్లను సంరక్షించుకోవడంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని ఏపీఎస్పీ రెండో పటాలం డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. శనివారం నగరంలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జాతీ య హరిత సంరక్షణ సమూహ కార్యక్రమాల్లో భాగంగా, నేషనల్ గ్రీన్‌కోర్ యూత్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు టి. వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయ పాటి శ్రీనివాస్, పట్టణ పౌర సంరక్షణ సంఘం సభ్యుడు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యంగా జీవించండి: ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), జూలై 27: వయస్సు పెరగడం వల్ల శరీరంలో చిన్న చిన్న మార్పులు వస్తాయని, అయినా ఆరోగ్యంగా జీవించాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ అన్నారు. శనివారం కాలేజీలోని ఫిజియాలజీ డిపార్టుమెంట్ జోనల్ సీఎంఈని నిర్వహించారు. ఫిజియాలజీ హెచ్‌వోడీ డా. అమీరున్నీసా బేగం మాట్లాడారు. సీఎంఈ జోనల్ కోఆర్డినేటర్ డా. ఎలిజబెత్‌రాణి, వైస్ ప్రిన్సి పాల్ డా. సాయిసుధీర్, డా.పద్మ విజయశ్రీ, డా. రేణుకాదేవి పాల్గొన్నారు.

కంటి జబ్బులపై అవగాహన కల్పించండి

ఓర్వకల్లు, జూలై 27: విద్యార్థులకు కంటి జబ్బులపై అవగాహన కల్పించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ సత్యనారాయణ అన్నారు. ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో మం డల స్థాయిలో ఉపాధ్యాయులకు కంటి జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ● ఘనంగా బీవీ మోహన్‌రెడ్డి 12వ వర్ధంతి

ఎమ్మిగనూరు, జూలై 27: తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ఎమ్మిగనూరు అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో బీవీ మోహన్ రెడ్డి 12వ వర్ధంతిని నిర్వహించారు. బీవీ చిత్రపటానికి ఆయన తనయుడు, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశ్రీ మాచాని సోమప్ప తరువాత ఎమ్మిగనూరును అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు తన తండ్రి బీవీ మోహన్‌రెడ్డి అని చెప్పటానికి గర్వపడుతున్నా అన్నారు. ఎమ్మిగనూరు అభివృద్ధిలో తన తండ్రి బీవీ ఉన్నారని, భౌతికంగా ఆయన దూరమైన మనందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, ముగతి ఈరన్న గౌడ్, రామదాసు గౌడ్, ముల్లా కలీము ల్లా, కాశీం వలి, గోపాల్, గురురాజు, చిన్నరాముడు, కేటీ వెంకటేశ్వర్లు, కొండన్న గౌడ్,మాదన్న, బోయ జగదీష్, హంపయ్య, ఆర్బీసీ అల్తాఫ్, దాదాసాహేబ్, గోనెగండ్ల నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య, చాంద్ బాషా, తిమ్మారెడ్డి, రాకేజేష్ నాయుడు, నాగరాజు, సంధ్య, మాజీ కౌన్సిలర్లు రామకృష్ణ నాయుడు, రంగస్వామి గౌడ్, జయన్న, బచ్చాల రంగన్న, జబ్బార్ పాల్గొన్నారు.

నందవరం: నందవరంలో మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా టీడీపీ నాయకులు నిర్వహించారు. శనివారం మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి 12వ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో షరీఫ్, పూలచింత బండేగురుస్వామి, మాజీ ఎంపీటీసీ తిమ్మరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: గోనెగండ్లలో టీడీపీ కార్యాలయంలో బీవీ మోహన్‌రెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, ప్రధానకార్యదర్శి తిరుపతయ్యనాయుడు, మండల టీడీపీ నాయకులు బేతాలబడేసా, రామాంజినేయులు, రమేష్‌నాయుడు, ఐరన్ బండ ముల్లా బాషా, నూరహ్మద్, అడ్వకేట్ చంద్రశేఖర్, భారతం రహంతుల్ల, వెంకటేశ్వర్లు, ఫక్రుద్దీన్, శ్రీధర్, రంగస్వామినాయుడు, రఫీక్ కార్యకర్తలు పాల్గొన్నారు.


బీవీ మోహన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


నందవరంలో నివాళి అర్పిస్తున్న నాయకులు


గోనెగండ్లలో...

మొక్కలను పెంచి పర్యావరణాన్ని రక్షించండి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 27: ఎమ్మిగనూరు పట్టణంలోని వేణు విద్యాలయం స్కూల్ అధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డు పట్టుకొని చెట్లు-ప్రగతికి మెట్లు, మొక్కలను పెంచండి-పర్యావరణాన్ని రక్షించండి అంటూ నినాదాలు చేశారు. సోమప్ప సర్కిల్‌లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు ప్రదర్శించిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీ వేణు విద్యాలయం స్కూల్ ప్రిన్సిపాల్ బాబు నరేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలను పట్టుకొని చూపుతున్న విద్యార్థులు

మద్దికెర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పెరవలి గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనిల్ కుమార్‌గౌడు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని పెరవలి గ్రామంలో పెరవలి గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెరవలి గ్రామ సేవా సమితి సంఘం సభ్యులు రాజేష్ నాగరాజు, రవి, విజయ్, వెంకటేశ్, సుమన్, శ్రీధర్, రామాంజనేయులు, ఉపాధ్యాయులు రాజశేఖర్, రంగస్వామి ఉన్నారు.

కౌలు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన

మద్దికెర, జూలై 27: మండలంలోని రైతులకు కౌలు హక్కు పత్రాలపై వ్యవసాయా శాఖ మండల అధికారి ఉప్పరి రవి ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 220 మందికి కౌలు హక్కు పత్రాల కార్డులకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఈ కౌలు కార్డులు పొందేందుకు భూయజమాని ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, అగ్రిమెంటు మీద ఒప్పందం రాసి ఉండాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది జాకీర్, ఆనంద్, రాణి ఉన్నారు.

కుష్ఠు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మద్దికెర, జూలై 27: కుష్ఠు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో కుష్టు సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై సర్వే జరుగుతుందన్నారు. కుష్ఠు వ్యాధి నిర్ధారణ అయితే.. వెంటనే వైద్యశాలకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గాయత్రీ, తదితరులుఉన్నారు.


సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారి రాగిణి

ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ

దేవనకొండ, జూలై 27 : ఉద్యానవన పంటలతోనే అధిక లాభాలు సాధించవచ్చని కర్నూలు డీహెచ్‌వో రామాంజనేయులు అన్నారు. కప్పట్రాళ్లలోని తానా భవనంలో సే ట్రీస్ అధ్వర్యంలో ఉద్యానవన పంటలపై రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యాన పంటలు సాగు చేసే తరుణంలో మొక్క నాటినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో పత్తికొండ అర్టికల్చర్ అధికారి దస్తగిరి ప్రోగ్రాం మేనేజర్ నారాయణ, ఎఎస్సై శ్రీనివాసులు రైతులు చింతా మధు మల్లికార్జున, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తాం

దేవనకొండ, జూలై 27 : గత వైసీపీ ప్రభుత్వంలో భూఆక్రమణలు పాల్పడినవారిపై తాము అధికారులకు ఫిర్యాదు చేస్తామని జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. శనివారం లక్ష్మీరంగా ఫంక్షన్‌హాల్లో ఆయన మాట్లాడుతూ జనసేన కార్యకర్తలు సభ్యత్వం రూ.500 చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. జనసేన నాయకులు జగదీష్, కె. ఉచ్చీరప్ప, వీరేష్, బడేసాబ్, నందు, రామాంజినేయులు, సరోజ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకప్ప

వెల్దుర్తి: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని జనసేన పార్టీ మండల కార్యదర్శి బాబ్జీ అన్నారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగుస్తుందని, ఇంకా ఎవరైనాసభ్యత్వ నమోదు చేసుకోలేని వారు ఉంటే పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, సెల్ నెంబర్, రూ.500 చెల్లించి పార్టీ సభ్యత్వం పొందవచ్చన్నారు. సభ్యత్వం పొందిన వారికి రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు.

31న పాలిటెక్నిక్ కోర్సులకు ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్స్


ఆదోని (అగ్రికల్చర్), జూలై 27: నెల 31న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలను స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి తెలిపారు. పాలిసెట్-2024 ఉత్తీర్ణులైన, ఉత్తీర్ణత కానీ విద్యార్థులు పదో తరగతి పాసైన వారు హాజరు కావచ్చు అన్నారు. కళాశాలలో ఈఈఈ (ఎలక్ట్రికల్), ఈసీఈ ఎలక్ట్రానిక్స్ కోర్సులలో చేరవచ్చన్నారు స్పోర్ట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లుతో పాటు కుల, ఆదాయ సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌కి అన్సర్ అయ్యే వారు రూ.5400 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

డిగ్రీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆలూరు, జూలై 27: ఆలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ శనివారం తెలిపారు. బీఏ (హిస్టరి), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ (జూవాలజీ) గ్రూపులకు మొదటి వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలన్నారు.

సైనికుల సేవలు ప్రశంసనీయం

ఆదోని టౌన్, జూలై 27: దేశరక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి, కుటుంబాల నుంచి దూరంగా విధులు నిర్వహిస్తున్న సైనికుల సేవలు ఎంతో ప్రశంసనీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు విట్టా రమేష్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేపీ యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన శనివారం మాజీ సైనికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్ కుమార్, మాజీ సైనికులు రెడ్డి, యానుష్ ఖాన్, భాస్కర్, కబీర్, గిరిబాబు బీజేవైఎం నాయకులు శివరాజ్, వినోద్, మారుతి, సాయి పాల్గొన్నారు.


మాజీ సైనికులను సన్మానించిన యువమోర్చా నాయకులు

కలగొట్లలో బండలాగుడు పోటీలు

వెల్దుర్తి, జూలై, 27: కలగొట్ల గ్రామంలో శనివారం సర్పంచ్ మద్దిలేటి ఆధ్వర్యంలో అంతరాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను టీడీపీ జిల్లా నాయకులు సుబ్బరాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతాప్ నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనులను త్వరలో చేపడతాం

గోనెగండ్ల, జూలై 27: మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు జలజీవన్ మిషన్ కింద పనులను త్వరలో చేపడతామని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సాంబయ్య తెలిపారు. శనివారం ఎంపీడీవో సమావేశం భవనం నందు మండల సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు ఎంపీపీ నసూరుద్దీన్ అధ్యక్షత వహించారు. డీఈ సాంబయ్య మాట్లాడుతూ తాగునీటి సమస్యను తీర్చేందుకు గోనెగండ్లతో పాటు వేముగోడు, తిప్పనూరు, బోడేపాడు, కున్నూరు, కులుమాల, గుల్లమరుసు, గ్రామాలకు జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరయ్యాయి. గోనెగండ్లలో పనులకుగాను 3.51 కోట్లు మంజూరయ్యాయి. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ రూ. 20 లక్షల పనులు చేసినిధులు విడుదల కాక పోవడంతో పనులను మధ్యలోనే వదిలి వేశాడు. ఇక వేముగోడు గ్రామానికి రూ. 50 లక్షలు మంజూరు అయినప్పటికి రూ. 24 లక్షలతో గ్రామంలో సగం పనులు చేసి మిగతా పనులను మధ్యంలో వదిలి వేశారన్నారు. కులుమాల,రూ. 52 లక్షలు, బోడేపాడుకు రూ. 50 లక్షలు, కున్నూరుకు రూ. 52 లక్షలు, తిప్పనూరు, రూ. 50 లక్షలు, గుల్లమోరుసు గ్రామానికి కూడా నిధులు విడుదల అయ్యాయని ఈ పనులను త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ నాగేష్, ఎంఈవో రామాంజినేయులు, ఇరిగేషన్‌ఏఈ ఉదయ్‌భాస్కర్, విద్యుత్ ఏఈ సుధాకర్, ఉపాధిహామీ ఏపీఎం మహ బూబూబ్ బాషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాంబయ్య

హాలహర్వి పాఠశాల తనిఖీ

నందవరం, జూలై 27: నందవరం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలోని పాఠశాలను డిప్యూటీ కలెక్టర్ నారాయణ శర్మ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. సీసీ రోడ్లు డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల ముందు మురుగు నీరు నిలువ ఉండాడాన్ని చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● హలహర్విలోని దేశాయి చెరువు ఎంత నల్లమట్టిని తరలిస్తున్నారని, ఎన్ని క్యూసెక్కుల మీటర్ల మట్టిని రైతులు తీసుకెళ్తున్నారని ఎల్లెల్సీ ఏఈ నీలకంఠను డిప్యూటీ కలెక్టర్ నారాయణ శర్మ ప్రశ్నించారు. 70 ట్యాక్టర్ల మట్టి ఎన్ని క్యూబిక్ మీటర్లు అవుతుందని అడుగగా ఏఈ మణికంట సమాధానం చెప్పలేక నీళ్లు నమిలాడు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

డీజీపీని కలసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ,జూలై27: రాష్ట్ర డీజీపీ తిరుమలరావును పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడలోని కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందించి మాట్లాడారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించండి

కౌతాళం, జూలై 27: కౌతాళం గ్రామ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, కొళాయి పన్నులు, పాత బకాయిలను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, పంచాయతీ కార్యదర్శి శివప్ప కోరారు. శనివారం వారు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలు ఇంటి పన్నులు, కొళాయి పన్నులతో పాటు వ్యాపారస్థులు తమ అంగళ్ల లైసెన్స్ బకాయిలను సకాలంలో చెల్లిస్తే గ్రామం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నాయకులు

పెద్దకడుబూరు, జూలై 27: కలెక్టర్ రంజిత్ బాషాను శనివారం కర్నూలులోని కలెక్టర్ కార్యాలయంలో పెద్దకడుబూరు టీడీపీ నాయకులు, రాష్ట్ర రైతుసంఘం టీడీపీ అధికార ప్రతినిధి రమాకాంతరెడ్డి, టీడీపీ నాయకురాలు నరవ శశిరేఖ, మల్లికార్జునలు శనివారం కలిశారు. పెద్దకడుబూరులోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మీసేవ ఆంజనేయులు, బొగ్గుల బాషా పాల్గొన్నారు.


కలెక్టర్‌ను కలిసిన నాయకులు

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ

దేవనకొండ, జూలై 27 : గత ఏడా ది పాటు జరిగిన ఉపాధి పథకం పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి సమక్షంలో 18వ సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. గత ఏడాది కాలంలో మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో రూ.12.68 కోట్ల పనులపై ప్రజావేదిక నిర్వహించారు. 13 మంది ఫీల్డ్ అసిస్టెంట్లపై రూ.42,218 రికవరీకి ఆదేశించారు. ఉపాధి పనులలో తప్పులు చేసినందుకు 23 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల పెనాల్టీ రూ.97 వేలు విధించారు. మండలంలోని గుండ్లకొండ ఫీల్డ్ అసిస్టెంట్ జాబ్ కార్డు కోసం రూ.5 వేలు లంచం అడిగారని గ్రామస్తులు పీడీకి ఫిర్యాదు చేశారు. గుండ్లకొండలోని ఎఫ్ఏ సంతకాలు ఫోర్జరీ చేసి పనులు చేసినట్లు, పని చేసిన వారికి కాకుండా ఇతరులకు బిల్లులు చేశారని డీఆర్పీ వివరించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన గుండ్లకొండ గ్రామస్తులకు, ఫీల్డ్ అసిస్టెంట్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకొంది. మిగతా గ్రామాల్లో తూతూ మంత్రంగా తనిఖీలు ముగిశాయి. అడిషనల్ పీడీ మాధవీలత, ఏపీడీ పక్కీరప్ప, ఎస్ఆర్పీ ఆవులయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో ఇద్రుస్ బాషా, ఏపీవో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

ధనవంతుల కోసమే కేంద్ర బడ్జెట్

ఎమ్మిగనూరు, జూలై 27: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ధనవంతుల కోసమే అన్నట్టుగా ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 బడ్జెట్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి,కార్మిక రంగాలకు సంబంధించిన కేటాయింపులు దేశాభివృద్ధికి ఆర్థికాభివృద్ధికి ఏమాత్రం దోహదపడవని ఆరోపించారు. నాయకులు గోవిందు, రాముడు, సురేష్, అబ్దుల్లా, కృష్ణ, సుభాన్‌లు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కోసం వినతి

ఆదోని టౌన్, జూలై 27: సామాజికంగా, రాజకీయంగా పూర్తిగా వెనుకబడిన తమకు నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని జంగమ, వీరశైవ హక్కుల పోరాట సమితి నాయకులు శివరాజ్, జేపీ మల్లికార్జున, ఎండీ బద్రినాథ్ అన్నారు. శనివారం వీరు మాట్లాడుతూ, టీడీపీ ఆవిర్భావం నుండి కూడా తమ సామాజిక వర్గం మద్దతుగానే ఉందని, ఈసారి ఎన్నికలలో కూడా జంగమ వీరశైవులు గెలుపు కోసం కృషి చేసారన్నారు. శ్రీశైలం ఆలయపాలక మండలిలో నామినేటెడ్ పోస్ట్‌తో పాటు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరుతూ చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు. గాజుల చంద్రశేఖర్, యడవల్లి మంజునాథ్, శివ కుమార్, లేపాక్షి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

హాలహర్వి, జూలై 27: రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులతో పాటు సంక్షేమ పథకాలు, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని బీజేపీ మండల కన్వీనర్ బసవరాజు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, గ్రామాల్లో కమిటీ సభ్యులు పాల్గొని కూటమి తరపున ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరారు.

ఆదోని రైల్వేస్టేషన్‌కు మహర్దశ

ఆదోని టౌన్, జూలై 27: అమృత్ భారత్ స్కీం కింద ఆదోని రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం రూ.10కోట్ల 30లక్షలు మంజూరు చేయడం కావడంతో ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌లను స్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదూరి విజయ్‌కృష్ణ, సాయి కుమార్ అభినందించారు. శనివారం రైల్వేస్టేషన్‌లో కమిటీ సమావేశం జరిగింది. స్టేషన్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కమిటీ సభ్యులు చర్చించారు. వృద్ధుల కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయడంతో పాటు, ప్లాట్‌ఫార్మ్‌లను విస్తరింపచేయాలని, వెయిటింగ్ రూములలో అన్ని సౌకర్యాలను సమకూర్చాలని, ప్రయాణికుల కోసం విజయవాడ వెళ్ళడానికి కొత్త రైలును ఏర్పాటు చేయాలని సభ్యులు సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు రమేష్ ఆచారి, చిల్లాలే దత్త, కునిగిరి లక్ష్మీ కాంత్, రైల్వే అధికారులు వెంకటేశ్వర్లు, జాఫర్ ఖాన్, ఇర్ఫాన్, త్రిభువన్, సురేష్ పాల్గొన్నారు.


తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆలూరు, జూలై 27: ఏళ్ల తరబడి ఆలూరు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాను జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ వెంకప్ప కోరారు. శనివారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ను కలసి నియోజకవర్గంలో మట్కా, పేకాట, సార, అక్రమ ఇసుక, గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు.


కలెక్టర్ రంజిత్ బాషాతో జనసేనా నాయకుడు వెంకప్ప

దేవేంద్రకు అబ్దుల్ కలాం అవార్డు

ఆస్పరి, జూలై 27: మండలంలోని పుటకలమర్రి గ్రామానికి చెందిన జామవా ఫౌండేషన్ ఛైర్మన్ దేవేంద్ర శనివారం అబ్దుల్ కలాం స్మృతి ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. 2024 న్యూస్ పేపర్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ అండ్ బాడ్ క్రాఫ్ట్ భారత దేశ ప్రభుత్వ చేత ఆయన ఢిల్లీలో అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఫేస్ గ్రూప్ ఛైర్మన్ ముస్తాక్ అన్సారీ, సునీల్ గుప్తా, సురేష్ బాబు, నదియా పాల్గొన్నారు.


ఢిల్లీలో అవార్డు అందుకున్న జామవా ఫౌండేషన్ ఛైర్మన్ దేవేంద్ర

నిషేధిత పురుగు మందులను విక్రయిస్తే లైసెన్స్ రద్దు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 27: పట్టణంలోని ఎరువులు విత్తన దుకాణదారులు డీలర్లు నిషేధిత పురుగుమందులను విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి అశోక్ కుమార్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీలను, ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.


పురుగు మందుల డబ్బాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి అశోక్ కుమార్

ఎస్టీయూ రాష్ట్ర కమిటీలో చోటుపై హర్షం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 27: పట్టణంలోని పురపాలక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వీరచంద్ర యాదవ్‌ను ఎస్టీయూ రాష్ట్ర కమిటీలో రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, భీంరాజు సీనియర్ నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, లోక్యానాయక్ హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ విజయవాడలో జరిగిన రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారన్నారు. ఆదోని పట్టణ కమిటీ నుంచి వీరచంద్ర యాదవ్‌ను ఎన్నుకోవడం పట్ల రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

గోనెగండ్ల, జూలై 27: రైతులు సకాలంలో క్రాఫ్ లోన్‌లను రెన్యూవల్ చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ క్రిడిట్ అమర్‌నాథ్ శ్రీనివాసరావు రైతులను కోరారు. శనివారం మండల పరిధిలోని కులుమాల గ్రామంలో సచివాలయంలో రైతులతో ఎస్‌బీఐ అధికారులు సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ క్రిడిట్ అమర్‌నాథ్ శ్రీనివాసరావు, గోనెగండ్ల ఎస్‌బీఐ మేనేజర్ నరేష్‌బాబు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రైతులు క్రాఫ్ లోన్‌లను రెన్యువల్ చేసుకుంటే 0.7 శాతం వడ్డీ పడుతుందని, అలా చేసుకోకుంటే ఒక శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. సమావేశంలో ఎస్‌బీఐ సిబ్బంది మధు, రవి, విజయ్, బీసీలు అక్బర్, బడేసా, బాషా, శివ, మిన్నల్ల, జిలాన్, నరసన్న, హనుమంతు, ప్రభాకర్, లోక్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలి

ఆలూరు, జూలై 27: జైచిరంజీవ హమాలీ కార్మికులపై చర్యలు తీసుకోవాలని శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లా నాయకులు రామాంజినేయులు, భూపేష్ మాట్లాడుతూ డబ్బులకు ఆశపడి, ఎలాంటి విచారణ జరపకుండా, కార్మికులుగా పనిచేయని వారిని కొత్త యూనియన్ రిజిస్ట్రేషన్ చేసిన ఆదోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌పై చర్యలు తీసుకొని, కొత్తగా ఏర్పడిన జైచిరంజీవ యూనియన్‌ని రద్దు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తాలూకా అధ్యక్షుడు కే శివ, రైతు సంఘం తాలూకా కార్యదర్శి చాపల గోపాలు, హమాలి యూనియన్ నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు రామంజినేయులు, రాముడు, ఓబులేసు, గోవిందప్ప, మల్లికార్జున, నాగరాజు, పులి రంగన్న, శేఖర్, భీమన్న, ఎర్రిస్వామి, ఎస్ఎస్ బాషా పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

హమాలీలుగా గుర్తించాలి

ఆలూరు, జూలై 27: చదువుకుని ఉద్యోగం రాక హమాలీ వృత్తిని ఎంచుకొని జీవనం సాగిస్తున్న జై చిరంజీవ అమ్మాయిలు యూనియన్ రద్దు చేయాలని ఏఐటీయూసీ పరిధిలో ఉన్న హమాలీలు డిమాండ్ చేయడం సరికాదని ఎమ్మార్పీఎస్ ఆలూరు తాలూకా అధ్యక్షులు కత్తి రామాంజినేయులు అన్నారు. శనివారం నూతంగా రిజిస్టర్ అయిన జై చిరంజీవ హమాలీ యూనియన్‌కు ఆయన మద్దతు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ఏప్రిల్ 16న యూనియన్ రిజిస్టర్ అయిందన్నారు.. దళిత సామాజిక వర్గానికి చెందిన హమాలీలకు అరికేర రోడ్డు మొత్తం కేటాయించాలని పోలీసులను కోరామని, దీంతో బజారి, బస్టాండ్ హమాలీలు దాడులు కూడా చేశారన్నారు.. పోలీసులు, కార్మిక శాఖ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి జై చిరంజీవ హమాలీలకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో హమాలి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు తలారీ రామాంజినేయులు, కొమ్ము అంజినేయులు, వీరేష్, దాసరి రామాంజినేయులు, నరేష్, అనుమయ్య, శివ, ప్రేమ్ కుమార్, పరంధామయ్య, పాండు, రాముడు, ఉలిగప్ప పాల్గొన్నారు.

డీఐజీ, ఎస్పీలను కలిసిన వైకుంఠం శివ ప్రసాద్

ఆలూరు, జూలై 27: కర్నూలు రెంజ్ డీఐజీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కోయ ప్రవీణ్‌ను, జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌లను టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, ఆయన సతీమణి జ్యోతిలు శనివారం డీఐజీ, ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా వారిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆలూరు నియోజకవర్గంలో శాంతి భద్రతలు, పోలీసు సిబ్బంది కొరతను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.


డీఐజీకు బొకే అందిస్తున్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

మంగమాంబ దేవి ఆలయ అభివృద్ధికి కృషి

ఆలూరు, జూలై 27: మంగమాంబా దేవి అవ్వ ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ అనురాధ అన్నారు. శనివారం ఆలూరు మండలం కరిడిగుడ్డెం గ్రామంలో వెలసిన మంగమాంబ దేవి అవ్వ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని వారు ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ముద్దన గేరి గ్రామ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భీమలింగప్ప, రవికాంత్ రెడ్డి, తిమప్ప, నాగప్ప, అర్చకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.


రూ.లక్ష చెక్కును విరాళంగా అందిస్తున్న నాయకులు

అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

ఆదోని రూరల్, జూలై 27 : అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు అన్నారు. శనివారం సుందరయ్య భవన్‌లో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులం కారణంగా దేశంలో అంటరాని తనం కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి తిక్కప్ప, మునిస్వామి, పరమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

పారిశుధ్య పనులు చేపట్టాలి

తుగ్గలి, జూలై 27: గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య పనులను ప్రతి వారం చేపట్టాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో వర్షం నీరు నిల్వగా చేరి వీదులన్నీ మురుగుమయ్యే పరిస్థితి నెలకొందని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి ఎక్కడైనా రోడ్లపైన మురుగునీరు నిల్వగా ఉంటే వెంటనే ఆ నీటిని కాల్వల ద్వారా ఊరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు.

వైభవంగా తిక్కతాత రథోత్సవం

ఆస్పరి, జూలై 27: మండలంలోని బీసీగిరి గ్రామంలో వెలసిన తిక్కతాత రథోత్సవం వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, నారాయణ, రాముడు, ఈరన్న, పరమేష్, రంగస్వామి పాల్గొన్నారు.



ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

హొళగుంద, జూలై 27: మండలంలోని ముద్దటామాగి గ్రామాన్ని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి శనివారం పర్యటించారు. మొహర్రం పండుగ సందర్భంగా జరిగిన ఘర్షణపై ఇరువర్గాలపై కేసులు నమోదు కావడంతో వాటిపై విచారణ నిమిత్తం వచ్చినట్లు తెలిపారు. కేసుకు సంబంధించిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతిభద్రలను విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పెద్దయ్యనాయుడు, ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ వెంకటేష్, రామాంజి రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.